గణిత బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

డోర్నకల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు గణితం బోధన కోసం మహిళ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ మున్నీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ, బీఈడీ ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలని చెప్పారు. దరఖాస్తులను డోర్నకల్ కేజీబీవీలో అందించాలన్నారు. ఎంపికైన మహిళా ఉపాధ్యాయులకు నెలకు వేతనం రూ.18 వేల వేతనం ఉంటుందన్నారు.

కుప్పలు తెప్పలు 'రెవెన్యూ' తిప్పలు

పేరుకుపోయిన 'భూ భారతి' దరఖాస్తులు



- ఈ నెల 15 కల్లా పరిష్కరించాలని ప్రభుత్వం గడువు
- ఇక మిగిలింది వారం రోజులే..
- ఉమ్మడి జిల్లాలో 2.26 లక్షల దరఖాస్తులు దాఖలు
- పరిష్కారమైంది 2,462 మాత్రమే
- పరిష్కారంలో ఉన్నవి 7,665
- విచారణ వ్యవస్థలు లేక జాప్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 15 నాటికి పరిష్కరించాలని ప్రభుత్వం విధించిన లక్ష్యం నెరవేరేలా లేదు. ఇంకా గడువు వారం రోజులే మిగిలి ఉంది. దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయి ఉన్నాయి. వేల సంఖ్య దరఖాస్తులు రాగా, పరిష్కరించిన దరఖాస్తులు వందల్లోనే ఉన్నాయి. మిగతా తరఖాస్తులను ఈ వారం రోజుల్లో ఎప్పుడు, ఎలా పరిష్కరించాలో తెలియక రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చినప్పటికీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే చందంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2.26 లక్షల దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 2462 (1.08 శాతం) మాత్రమే పరిష్కరించారు.

పరిష్కారం శూన్యం

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,26,961 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 2462 (1.08 శాతం) దరఖాస్తులు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. మరో 7,665 దరఖాస్తులు (3.37 శాతం) పరిష్కారంలో ఉన్నాయి. ఉదాహరణకు హనుమకొండ జిల్లానే తీసుకుంటే ఈ జిల్లాలో వివిధ భూ సమస్యలకు సంబంధించి 34,973 దరఖాస్తులు రాగా వీటిలో 229 మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 974 దరఖాస్తులు పరిష్కారంలో ఉన్నాయి. మిగతా జిల్లాలో పరిస్థితి ఇలాగే ఉంది.

ఆన్‌లైన్‌కే అధిక సమయం

తొలుత ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లో భూభారతి కింద ప్రయోగాత్మకంగా దరఖాస్తులను స్వీకరించిన వాటిలో కూడా 50 శాతం మించి పరిష్కరించలేదు. ఆ తర్వాత జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు ఆరు జిల్లాలు.. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. వీటిని ఆన్‌లైన్ చేసి సమస్యలపై నోటీసులు జారీ చేసి, తదనంతరం పరిష్కార ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికే అధిక సమయం పడుతుండడంతో మిగతా ప్రక్రియలపై మండల స్థాయి సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెవెన్యూ సదస్సులో లక్షా 30వేల దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిని స్కాన్ చేసి మండల స్థాయిలో భూభారతి పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది రోజువారీ విధులతో పాటు అర్ధరాత్రి వరకూ ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లా ఏర్పాటు అనంతరం అదనపు సిబ్బందిని పెంచలేదు. క్యాడర్ స్థిరీకరణ చేయలేదు. దీంతో కొన్ని మండలాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, గిర్దావార్లు, ఒకరిద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. రోజువారి సాగు భూముల రిజిస్ట్రేషన్లను తహసీల్దార్, భూభారతి ఆపరేటర్ నిర్వహిస్తుండ గా మిగిలిన వారిపై ఈ దరఖాస్తులకు సం బంధించిన పనిభారం పడుతోంది.

జిల్లా	దాఖలైన దరఖాస్తులు	పరిష్కారంలో ఉన్నవి	పరిష్కారమైనవి
హనుమకొండ	34,973	974	229
వరంగల్	53,933	894	203
జనగామ	17,867	1,729	649
మహబూబాబాద్	39,419	921	195
ములుగు	32,118	2,217	833
భూపాలపల్లి	48,651	930	353
మొత్తం	2,26,961	7665	2462

సిబ్బంది కొరత

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కరించడానికి గతంలో తహసీల్దార్లకు గ్రామాల్లో వీఆర్వో, వీఆర్ఏలు, సర్వేయర్లు అందుబాటులో ఉండేవారు. ఆ వ్యవస్థ రద్దుకావడంతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడంలో అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో భూ సమస్యలపై పట్టున్న రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో సమస్యలు పరిష్కరించడం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం.. గ్రామాల్లో తిరిగి రెవెన్యూ వ్యవస్థను అమలు చేయడం కోసం గ్రామ పాలనాధికారులను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు పూర్వ వీఆర్ఏలు, వీఆర్వోలను గామ పాలనాధికారులుగా నియమించడానికి వారి విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని రాత పరీక్షను నిర్వహించింది. అలాగే సర్వేయర్ల కొరతను తీర్చడానికి ప్రైవేటు సర్వేయర్ల వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చింది. జిల్లాను యూనిట్‌గా తీసుకొని సర్వేయర్లను నియమించడానికి (మిగతా 8లో..)



సమావేశంలో మాట్లాడుతున్న రామచందర్‌రావు


బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌వి దొంగ మాటలు
- బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి..
- బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకు సీఎం యత్నం
- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసును సీఐడీకి ఎందుకు అప్పగించడం లేదు..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

8

నేడు వరలక్ష్మి వ్రతం

- దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక పూజలు చేయనున్న మహిళలు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శ్రావణమాసం రెండో శుక్రవారం (నేడు) మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం వేడుకలను జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. తెల్లవారుజాము నుంచి మహిళలు, యువతులు ఆలయాలకు చేరుకొని, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు ఇళ్లల్లో కలశస్థాపన, కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించి, దేవాలయాలు, ఇళ్లల్లో వ్రతాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి సామూహిక నివేదన, పసుపు, కుంకుమ, శనగలు, పూర్ణాలు, పండ్లతో వాయినాలు సమర్పించనున్నారు.

శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ బాధ్యులు చౌడవరపు సుందర్‌గుప్తా, చౌడవరపు మోహన్‌రావు, ఇమ్మడి రవికుమార్, సోమ సీతారం గురువారం తెలిపారు. ఆలయంలో ఉదయం 10.30 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని మహిళలు అత్యధిక సంఖ్యలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

వైద్యం వికటించి బాలిక మృతి

- మరిపెడలోని ఆర్ఎంపీ క్లినిక్ ఎదుట బంధువుల ఆందోళన
- వరంగల్-ఖమ్మం హై వేపై రాస్తారోకో
- క్లినిక్ వైద్యుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



మృతి చెందిన మణిదీప(ఫైల్), ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మరిపెడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వైద్యం వికటించి మూడేళ్ల బాలిక మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని ఉల్లెపల్లిలో చోటు చేసుకుంది. మరిపెడలో రవి క్లినిక్ వైద్యుడు రవిబాబు చేసిన వైద్యం వికటించి బాలిక మృతి చెందిందని మృతురాలు కుటుంబసభ్యులు, బంధువులు ఆ క్లినిక్ ఎదుట ఆందోళన చేసి వరంగల్-ఖమ్మం హైవేపై రాస్తారోకో నిర్వహించారు. బాలిక మృతికి కారకుడైన వైద్యుడిని మరిపెడ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. మరిపెడ మండలం ఉల్లెపల్లికి చెందిన కొలిచల్మ మల్సూర్-మహేశ్వరి దంపతుల కుమార్తె మణిదీప(3) బుధవారం రాత్రి బాడీ నొప్పులకు రాసుకునే అయింట్మెట్ మింగింది. గుర్తించిన బంధువులు ఆ బాలికను మరిపెడలోని రవి క్లినిక్‌కు తీసుకెళ్లారు. ఆ బాలికకు ఆ క్లినిక్ డాక్టర్ రవిబాబు ఓ ఇంజక్షన్ చేసి మందులు ఇచ్చి ఇంటికి పంపారు. ఇంటికి వెళ్లాక బాలిక పూర్తిగా అపస్మారకస్థితికి చేరుకుంది. మళ్లీ అదే వైద్యుడి వద్దకు రాత్రి తీసుకెళ్లగా, డాక్టరే కారు మాట్లాడి ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పి పంపాడు. ఆమెను కుటుంబ సభ్యులు ఖమ్మం తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు ఖమ్మం వైద్యులు తెలిపారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం సాయంత్రం డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, క్లినిక్ ఎదుట ఆందోళన చేశారు. వరంగల్-ఖమ్మం హైవేపై రాజీవ్‌గాంధీ విగ్రహం దగ్గర రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు చేరుకొని ఆ క్లినిక్ వైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నారు.

ఇనుగుర్తిలో ఇన్‌-చార్జి కలెక్టర్ తనిఖీలు



గురుకులంలో విద్యాభ్యాసాన్ని పరిశీలిస్తున్న లెనిన్ వత్సల్ టొప్పొ

ఇనుగుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులం, ఎరువుల దుకాణాలను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లోని రికార్డులను, ప్రజలకందిస్తున్న సేవలను పరిశీలించారు. గురుకులంలో విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో విద్య, ఆరోగ్య, పోషకాహారం, పరిశుభ్రత అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టినందున అందుకు అనుగునంగా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ తరంగిణి, ఎంపీడీవో హరిప్రసాద్, కార్యదర్శి లక్ష్మీకాంత్, ప్రిన్సిపాల్ జయశ్రీ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్

- కేసీఆర్‌పై కక్షతో ప్రాజెక్టులు నిర్వీర్యం
- రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా మార్చారు
- మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, గండ్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

హనుమకొండ టౌన్, 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అని కేసీఆర్‌పై కక్షతో సాగు నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. జనగామ జిల్లా పూర్తిగా దేవాదుల నీళ్లపై అధారపడి ఆయకట్టు రైతులు వ్యవసాయం చేస్తుంటారని ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో నిర్మించిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు మహా అద్భుతం అని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి మీద ఒత్తిడి తీసుకువచ్చి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల మూడోదశ పనులను పూర్తి చేసి ఆయకట్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో అనేకమంది నిరుపేదల ఇండ్లను కూల్చి వేసిందని విమర్శించారు.

గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో దేవాదుల ప్రాజెక్టు మోటార్లు పూర్తిస్థాయిలో నడవలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వలేదని విమర్శించారు. రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో రెతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా మార్చారని రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఒక్కరోజైనా నీళ్ల మీద సమీక్షలు ఎందుకు చేయడంలేదని విమర్శించారు. కాళేశ్వరం మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగాయని, కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌పై కక్ష సాధింపుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యపు, అవినీతి అరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు, రైతులు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు హరి రమాదేవి, దేవమ్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కోర్టు సీనియర్ జడ్జి షాలిని



జిల్లా కోర్టులో కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్న షాలిని

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులు త్వరలో జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు సీనియర్ జడ్జి షాలిని అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో గురువారం కక్షిదారులతో న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా షాలిని మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఖర్చులేని సులభమైన పరిష్కారం లభిస్తుందన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని చెప్పారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసును త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సునీత, కక్షిదారులు పాల్గొన్నారు.

వాన దేవుడా..!?

జిల్లాలో సరిపడ పడని వర్షాలు



- ఐదు మండలాల్లో తగ్గిన వాన
- 13 మండలాల్లో సాధారణం
- 5.0 మిలిమీటర్ల మైనస్ వర్షపాతం
- భారీ వాన, ఎస్సారెస్పీ జలాల కోసం అన్నదాతల నిరీక్షణ

మహబూబాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ వానాకాలంలో సరిపడ వర్షాలు పడలేదు. ఎప్పుడెప్పుడు సరిపడ వానలు కురుస్తాయా అని రైతులు ఆకాశం వైపు చూస్తున్నాడు. వ్యవసాయ పనులు ఊపందుకోవాల్సి ఉండగా.. ఆగస్టు నెల ప్రారంభమై వారం రోజులు గడిచిన అంతంతమాత్రంగానే వర్షాలు కురుస్తున్నాయే తప్ప, భారీ వర్షాల జాడ లేదు. ఇప్పటి వరకు జిల్లాలో ఐదు మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. 13 మండలాల్లో సాధారణ వర్షపాతంగా నమోదైంది. భారీ వర్షాల జాడ లేకపోవడంతో అన్నదాతలు ఉక్కిరి..బిక్కిరవుతున్నారు. భారీ వర్షాల కోసం.. ఎస్సారెస్పీ జలాల కోసం రైతుల ఎదురుచూపులు తప్పడం లేదు.

ఐదు మండలాల్లో లోటు..

వానాకాలం సీజన్‌లో జూన్ 1 నుంచి ఆగస్టు 7 వరకు 452.9 మిల్లీమీటర్ల వర్షం కురియాల్సి ఉండగా, 430.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా మొత్తంలో సగటున మైనస్ 5.0 లోటుగా ఏర్పడింది. జిల్లాలోని కురవి, మహబూబాబాద్, చిన్నగూడూరు, తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో మైనస్ 21.0 మిల్లీమీటర్ల నుంచి మైనస్ 28.0 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం తక్కువైంది. కొత్తగూడ, గంగారం, బయ్యారం, గార్ల, డోర్నకల్, గూడూరు, కేసముద్రం, దంతాలపల్లి, నెల్లికుదురు, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ, సీరోలు, ఇనుగుర్తి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

అలుగులుపడ్డ 114 చెరువులు..


జిల్లాలో 1,590 చెరువులు ఉన్నాయి. అందులో అడపదడపా కురుస్తున్న వర్షాలకు ఇప్పటి వరకు జిల్లాలో 144చెరువులు మాత్రమే అలుగులు పోసినట్లు జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. బయ్యారంలో 98 చెరువులు ఉండగా 13 చెరువులు అలుగులు పడ్డాయి. కొత్తగూడలో 380చెరువులకు 37, గంగారంలో 214 చెరువులకు 76 నిండి అలుగులు పడుతున్నాయి. 368 చెరువుల్లో 75 శాతం మాత్రమే నిండాయి. 360 చెరువులు 50 శాతం మాత్రమే నిండగా 450 చెరువులు 50శాతంలోపే (మిగతా 8లో..)

7.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్ : జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 119.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 7.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. కేసముద్రంలో 31.4, మహబూబాబాద్‌లో 16.4,, కురవిలో 12.4, డోర్నకల్‌లో 13.2, గార్లలో 17.6, బయ్యారంలో 28.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో వర్షం కురియలేదు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

జాటోతు బాలాజీ, రైతు, అమర్‌సింగ్ తండా, తొర్రూరు



నాకున్న నాలుగెకరాల భూమిలో మూడు ఎకరాల్లో వరి, ఎకరంలో పత్తి సాగు చేస్తున్నాను. వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ బావిలోని నీటిని ఉపయోగిస్తున్నా.. వర్షాలు లేకపోవడంతో రోజు రోజుకు బావిలో నీటిమట్టం తగ్గిపోతుంది. పంటలను రక్షించేందుకు ఎస్సారెస్పీ కాలువల ద్వార నీటిని విడుదల చేయాలి.



మూసివేసిన సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లు

సమ్మక్కసాగర్ బ్యారేజీ గేట్ల మూసివేత

కన్నాయిగూడెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజీ గేట్లను మూసివేసి నీటిని నిల్వ చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటిపారుదల శాఖ అధికారులు క్రమక్రమంగా గేట్లను మూసివేస్తూ వస్తున్నారు. బుధవారం బ్యారేజీలోని 10 గేట్లను మూసిన అధికారులు, గురువారం ఉదయానికి మరో 20 గేట్లను మూసివేశారు. మరలా తిరిగి మధ్యాహ్నం 3గంటల కల్లా మరో 17 గేట్లను మూసివేశారు. ఎగువ నుంచి 1,07,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీలో మొత్తం 47 గేట్లు మూసివేసి 12 గేట్ల ద్వారా 93,920 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బారేజీ వద్ద 74.95 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 75,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద నీటి మట్టం 1.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

డల్లాస్ ఐవోసీ సమావేశానికి హాజరైన ఇందిర



డల్లాస్‌లో ఇందిరకు స్వాగతం పలుకుతున్న ఐఓసీ ప్రతినిధులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఏలో డల్లాస్ పట్టణంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఏవోసీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, రాజకీయ పరిణామాలు, భవిష్యత్తు పార్టీ కార్యాచరణ అనే పలు అంశాల పైన సదస్సుల్లో ఆమె వివరించారు. కార్యక్రమంలో సింగపురం ఇమ్మానుయల్ రాజ్, ఐఓసీ సౌత్ వెస్ట్ ప్రెసిడెంట్ గురుదేవ్, కన్వీనర్ నీరజ్, సోసల్ మీడియా కోఆర్డీనేటర్ అచ్యుత్ జనరల్ సెక్రటరీ రమణారెడ్డి, కోశాధికారి కంచర్ల భగీరథ, టీపీసీసీ సభ్యుడు సూర్యోదరాహుల్, వేణు, శ్రీధర్ పాల్గొన్నారు.

పలు రైళ్లకు బోగీల పెంపు

కాజీపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు బోగీలు పెంచుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12705/6) గుంటూరు నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్ ట్రిప్పులకు ఛైర్‌కార్, 01, 3ఏ (ఈ)- 01 రెండు బోగీలను ఈ నెల 12 నుంచి పెంచుతున్నారు. (12757/58) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అప్ అండ్ డౌన్ ట్రిప్పులకు 3ఏ (ఈ)-01 ఒక బోగీని ఈ నెల 11 నుంచి పెంచుతున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు.

మ్యూచువల్ టీచర్ల డుమ్మాలు

- పాఠశాలలకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆరోపణలు
- స్ట్రాంగ్ టీచర్ల పేరుతో కొందరి హంగామా
- సంఘాల పేరుతో హల్‌చల్
- కాటారం సబ్‌డివిజన్‌లో ఉపాధ్యాయుల తీరుపై చర్చ

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని పలు మండలాలకు మ్యూచువల్ బదిలీల ద్వారా వచ్చిన ఉపాధ్యాయుల తీరు తీవ్ర చర్చనీయాంశమవుతోంది. ఒకరిద్దరు మినహాయించి ఆయా కాంప్లెక్సుల పరిధిలో వీరు చేసే హంగామా అంతా ఇంతా కాదనే చర్చ నడుస్తోంది. ప్రధానంగా మారుమూల మండలమైన పలిమెల, మహాముత్తారం, మల్హర్ మండలాల్లోకి వచ్చిన వారి గురించైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

హనుమకొండ, కరీంనగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలు, సమీప పాఠశాలల్లో పోస్టింగ్ కోసం పలువురు స్పౌజ్ ఉపాధ్యాయులు ప్రయత్నించినప్పటికీ బదిలీలు కాలేదు. దీంతో మ్యూచువల్ పద్ధతిలో బదిలీలకు సిద్ధమవ్వగా ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రాంతాన్ని బట్టి రూ.15లక్షల నుంచి రూ.30లక్షల వరకు తీసుకుని మారుమూల ప్రాంతాలకు బదిలీపై వచ్చినట్లు ఆరోపణలున్నాయి. బదిలీపై వచ్చిన వీరు పలువురు స్ట్రాంగ్ టీచర్లుగా, మరికొందరు పలు ఉపాధ్యాయ సంఘాల పేరుతో చలామణి అవుతూ విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఏ రోజు పాఠశాలలకు సక్రమంగా హాజరవడం లేదని.. హాజరైన వారు కాలయాపన చేస్తూ సమయం గడిపేస్తున్నట్లు సమాచారం. మ్యూచువల్ బదిలీలపై వచ్చిన వారిలో చాలా వరకు సీనియర్ ఉపాధ్యాయులు ఉండగా... ఇక్కడికి వచ్చిరాగానే దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇంకొంత మంది ఉపాధ్యాయులైతే మళ్లీ వారు కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. రవాణా సౌకర్యం సరిగా లేని పలిమెల, మహాముత్తారం, మల్హర్ వంటి మండలాల్లో పర్యవేక్షణ కొరవడటంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా తయారైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకా కొందరు విధుల సమయంలో చెట్టాపట్టాలేసుకుని ఆ ప్రాంతంలో చక్కర్లు కొడుతున్నట్లు తెలిసింది.

ఇటీవల మల్హర్ మండలంలోని పెద్దతూండ్ల పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు గత కొన్నేళ్లుగా విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులే సదరు ఉపాధ్యాయుడిని తొలగించాలని జడ్పీ సమావేశాల్లో చర్చించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పలువురు విద్యార్థులు సైతం ఆ టీచరు మాకొద్దంటూ మీడియాతో గోడు వెల్లబోసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇది ఒక్క కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఇదే ట్రెండ్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇంకా కొంత మందైతే ఒక్కో ఉపాధ్యాయుడి వద్ద నుంచి మూడు సంఘాల సభ్యత్వాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ సభ్యత్వం తీసుకోకపోతే సంఘంతో నీకు పని ఉండదా.. సంఘం నిన్ను చూసుకుంటుందిలే అంటూ స్వీట్ వార్నింగ్స్ ఇచ్చి వసూలు చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.



ఢిల్లీలో బిట్ల శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

కాంగ్రెస్ నాయకులకు రాఖీ కట్టిన సీతక్క

కొత్తగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లెపు రంజిత్ ఢిల్లీలో గురువారం పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఢిల్లీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ రిజర్వేషన్ ధర్నాకు బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు సుంకరబోయిన మొగిలి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ పాల్గొన్నారు. గురువారం అక్కడ మంత్రి సీతక్కను వారు కలిశారు. శ్రీనివాస్, రంజిత్‌కు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. వారితో పాటు కొత్తగూడ మండల ప్రజలకు సీతక్క రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈజీఎస్ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాలకృష్ణ

కాటారంలో ఈజీఎస్ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీవో బాలకృష్ణ అన్నారు. కాటారంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదికను గురువారం నిర్వహించగా రాత్రి వరకు సాగింది. 2024 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన సుమారు రూ.8.5 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల నివేదికలను ప్రజావేదికలో డీఆర్‌పీలు చదివి వినిపించారు. పలు చోట్ల పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు, నాటిన మొక్కలు అధిక శాతం చనిపోయినట్లు, మస్టర్ రోల్స్‌లో కొట్టివేతలు ఉన్నట్లు తెలిపారు. కూలీలకు వేతనాలు, మస్టర్లలో తేడాలున్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎస్టిమేట్ కాస్ట్ కన్నా అధికంగా పేమెంట్ జరిగిందని, మస్టర్ రోల్స్‌లో కొట్టివేతలు ఉన్నాయని ఆక్షేపించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని, నిధులను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీ చేస్తామన్నారు.

పూర్తిగా అందని రికార్డులు

మండల వ్యాప్తంగా 24 జీపీల్లో ఈజీఎస్ నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అన్ని పనులకు సంబంధించిన రికార్డులను అధికారులు తమ తనిఖీ బృందాలకు ఇవ్వలేదని సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ కవిత తెలిపారు. సుమారు రూ.4కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు సంబంధించి కొన్నింటి రికార్డులు, ఎంబీలు ఇవ్వకపోవడంతో సోషల్ ఆడిట్ పూర్తిగా జరగలేదని ప్రజావేదిక దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులు స్పందించి త్వరలోనే వాటి ఆడిట్ జరిగేలా చర్యలు తీసుకుటామన్నారు.

రూ.80,814 రికవరీకి ఆదేశాలు

మండలంలో జరిగిన 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్‌పీలు నివేదికల్లో మస్టర్ రోల్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, కొలతల్లో తేడాలతో పాటు పలు అంశాలపై ఈజీఎస్ అధికారులు, ఎఫ్‌ఏలు, కార్యదర్శుల నుంచి డీఆర్‌డీవో రూ.80,814 పెనాల్టీ రికవరీకి ఆదేశించారు. 24 జీపీలకు సంబంధించి ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ఎఫ్‌ఏల నుంచి పెనాల్టీ రూపంలో రికవరీకి ఆదేశించినట్లు డీవీవో రుబీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిర్మల, ఎంపీడీవో అడ్డూరి బాబు, అంబుడ్స్‌మెన్ ఎస్‌టీఎం శ్రీనివాస్, జిల్లా విజిలెన్స్ అధికారి రుబీనా, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, ఏపీవో వెంకన్న, ఎస్‌ఆర్‌పీ కవిత, జీపీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 10 మండల కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, అదనపు కలెక్టర్ పి.పింకేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపి సేవలు అందిం చేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆపై విద్యార్హత కలిగి, తెలంగాణ పారా మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగిన వారు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

●ఏఎన్‌ఎం పోస్టుకు..

జనగామ మండలం చౌడారం కేజీబీ వీలో ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషలాఫీసర్ రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ హాస్టల్‌లో ఖాళీగా ఏఎన్‌ఎం పో స్టును ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నామని, వేతనం నెలు రూ.7,800 చెల్లిస్తామని, ఇంటర్ విత్ ఏఎన్‌ఎం విద్యార్హతతో ఆసక్తి గల మహిళా అభ్యర్థులు 11 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 90109 31250 నంబరులో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జనగామ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన జనగామలో చోటు చేసుకుంది. పెద్దపహాడ్‌కు చెందిన తాళ్ల సిద్దులు(50) మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం జనగామలోని బీఎస్‌ఎన్‌ఎల్ సమీపంలో బస్ షెల్టర్‌లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ దామోదర్ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు అక్కడికి చేరుకుని మృతిదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిద్ధులుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచార మిచ్చారు. అనంతరం వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, సిద్దులు భార్య గతంలోనే చనిపోగా, ఇద్దరు కుమారులున్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కరీమాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తూ, ఇవ్వకుంటే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన సంగు గోవర్ధన్‌రెడ్డి అతడి భాగస్వాములు ఖిలావరంగల్ శివారులో భూమిని కొనుగోలు చేసి అందులో ప్లాట్లుగా విడగొట్టి విక్రయించారు. ఈ వ్యవహారంలో ఉర్సు ప్రాంతం కాశికుంట ప్రాంతానికి చెందిన బండి సుభాష్ రియల్ ఎస్టేట్ చేస్తున్న గోవర్ధన్, అతడి భాగస్వాములకు పలుమార్లు ఫోన్ తాను మూడు జిల్లాలకు నక్సలైట్ కార్యదర్శిగా పనిచేశానని, తన వద్ద తుపాకీ ఉందని, మీరు చేస్తున్న రియల్ ఎస్టేట్ ప్లాట్ల అమ్మకాల్లో తనకు పావు వాటా ఇవ్వాలని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయమై గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, గురువార సుభాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

విచ్చలవిడి వ్యాపారం

- బిల్లులు లేకుండానే పురుగుమందుల విక్రయాలు
- చోద్యం చూస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- నామమాత్రపు తనిఖీలతోనే సరి



మహదేవపూర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్, పలిమెల మండలాల్లో పురుగు మందుల విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రం సహా గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటైన పురుగుమందుల దుకాణాలు అర్హతలు లేకుండానే విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అనుమతులు ఒకరి పేరుంటే.. దుకాణాల్లో సంబంధం లేని వ్యక్తులు విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో రైతులకు బిల్లుల మీద అవగాహన లేకపోవడంతో నిర్వాహకులు రైతుల నుంచి అందినకాడికి దండుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతులు పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు అరువునకు తెస్తుండటంతో బిల్లుల అడిగే పరిస్థితి లేదని, ఒక వేళా అడిగితే ముందు డబ్బులు కడితే బిల్లు అప్పుడిస్తామని బదులిస్తున్నట్లు తెలుస్తోంది. అవగాహన లేని వ్యక్తులు విక్రయాలు చేపట్టుతుండటం, వాటికి బిల్లులు కూడా ఇవ్వకపోతుండటంతో రైతులు తమ పంటలను మొక్క దశలోనే కోల్పోతున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల మండల పరిధిలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో రైతు కొనుగోలు చేసిన పురుగు మందు పిచికారీ చేయడంతో సుమారు రెండెకరాల వరకు పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిసింది. మీరిచ్చిన మందులు వాడటంతోనే పంట నష్టపోయానని రైతు వెళ్లి అడగ్గా దిక్కున్నచోట చెప్పుకో అంటూ వ్యాపారి దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. మళ్లీ గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ జరగ్గా నష్టపోయిన పంటకు పరిహారం ఇచ్చేందుకు ఫర్టిలైజర్ షాపు యజమాని ముందుకు వచ్చినట్టు తెలిసింది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఇటీవల పదుల సంఖ్యలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. రైతు సమస్యలపై స్పందించాల్సిన మండలాధికారి కనీసం ఫోన్ చేసినా ఎత్తడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. అలాగే అధికారులు కార్యాలయానికి సమయానికి రావడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇన్ని జరుగుతున్నా నామమాత్రపు తనిఖీలు చేసి ఫొటోలకు పోజులిచ్చేందుకే పరిమితమవుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పలిమెల, మహదేవపూర్ మండలాల పరిధిలోని దుకాణాదారులు సర్టిఫికెట్లు పరిశీలించి, నిత్యం తనిఖీలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కేసముద్రంలో దొంగల ముఠా

●30 పందులు ● బైక్ అపహరణ

కేసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేసముద్రంలో మంగళవారం రాత్రి దొంగల ముఠా ఒకటి సంచరించింది. ఆర్వోబీ సమీపంలోని కాలనీలో శివరాత్రి సతీష్‌కు చెందిన రూ.4లక్షల విలువైన 30 పందులను రాత్రి గుర్తుతెలియని వ్యక్తు లు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ గురువారం తెలిపారు. సదరు వ్యక్తులు పందులను స్థానిక బ్రాందీషాపు పక్కన సందులోకి నడిపించుకుంటూ వెళ్లినట్లుగా సీసీ పుటేజీలు లభించాయి. అలాగే జూనియర్ కళాశాల సమీపంలో తండ అనీల్ తన పల్సర్ బైక్‌ను ఇంటిపక్కన సందులో నిలిపి ఉంచగా దానిని సైతం ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీసీ పుటేజీలో ఆరు నుంచి ఏడుగురు వ్యక్తులు గుంపుగా వచ్చి పందులతోపాటు బైక్ తీసుకువెళుతున్నట్లు కనిపినట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా పందులను ఎత్తుకెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



పందులను తీసుకువెళ్తున్న అగంతకులు

బయ్యారంలో ఆరుగురిపై..

బెదిరింపు కేసు నమోదు, రిమాండ్

బయ్యారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌లో వేచియున్న ముగ్గురిని బెదిరించిన ఘటనలో ఆరుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గార్ల గ్రామానికి చెందిన అన్వర్ పాష, గోపిచంద్‌లు ఇల్లెందుకు చెందిన ఉస్మాన్ పాషను బస్ ఎక్కించేందుకు ఈ నెల 5 రాత్రి సుమారు 11 సమయంలో బయ్యారం మండలం గంధంపల్లి బస్టాండ్ సెంటర్‌లో వేచియున్నారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న బయ్యారం మండలం కస్తూరీనగరం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మురళీకృష్ణ, వేణుబాబు, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, వుస్యా, రమేష్ ఒకకారు, ద్విచక్ర వాహనంపై వచ్చి గొడవపడుతారు. ఎవర్రా మీరు.. ఏ ఊరు మీది.. ఇక్కడ ఎందుకు ఉన్నారంటూ ఉస్మాన్ పాష, అనర్వర్ పాష, గోపిచంద్‌లను బెదిరించారు. అంతేకాకుండా వారి వద్ద నుంచి రూ. 2 వేలు నగదు, ఒక సీసీ కెమెరాతో పాటు ఒక టార్చ్‌లైట్ స్వాధీనపరుచుకొని ముగ్గురు వ్యక్తులను మోకాళ్లపై కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ఉస్మాన్ పాష 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా.. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకునేలోపు పై 6 గురు నిందితులు అక్కడి నుంచి పారిపోయినట్లు ఎస్సై వెల్లడించారు. ఉస్మాన్ పాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మురళీకృష్ణ, వేణు, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, వుస్యా, రమేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు. మురళీకృష్ణను గురువారం కోర్టులో రిమాండ్ పరచగా, మిగిలిన 5 గురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒకకారు, ద్విచక్ర వాహనం స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. కాగా, ఎవరైన ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2151	1521
పల్లికాయ (సూక)	5670	3450
పల్లికాయ (పచ్చిది)	4500	1575
కందులు	5873	3022
పెసళ్లు	7022	3022
పత్తి	7660	5300
పసుపు (కాడి)	12003	9534
పసుపు (గోల)	10180	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	13800	11500
వండర్‌హాట్	12000	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

అనుబంధాల వేడుక..
ఆత్మీయతల వేదిక



రేపు రక్షాబంధన్ పర్వదినం

- పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు
- ఇంటింటా కనిపిస్తున్న సందడి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అన్నాచెల్లెల ఆత్మీయఅనుబంధానికి ప్రతీక రాఖీ పర్వదినం. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేకంగా నిలిచాయి. కుందన్‌లు మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టూన్ రాఖీలు కూడ వచ్చాయి. పాతకాలంలో అతి పెద్దగా ఉండే రాఖీలు ధరించే వారు. రానురాను అవి చిన్నగా మారి పోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్ద పెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనమిచ్చాయి. దూరప్రాంతాల్లో ఉన్న సోదరులకు సోదరీమణులు కొరియర్, పోస్ట్ ఆఫీసుల ద్వారా ముందుగానే రాఖీలు పంపించారు. కాగా రూ.10 నుంచి మొదలుకుని 300 వరకు రాఖీ ధరలు పలుకుతున్నాయి.

పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు ఈ ఏడాది రాఖీ పర్వదినాన్ని సుఖఃసంతోషాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 8వ తేదీ నాటికే పుట్టింటికి చేరుకునేందుకు తరలివస్తున్నారు. రాఖీ పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, జంజాల పౌర్ణమి కూడా అంటారు. 9న పౌర్ణమి తిథి కాబట్టి ఈ రోజే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు. సోమవారం రాఖీ పర్వదినాన్ని జరుపుకోవచ్చనే పండితుల సూచనల మేరకు ఆడపడుచులు రాఖీలు, స్వీట్లతో పుట్టింటికి చేరుకుంటున్నారు. పంచాంగం ప్రకారం ఈనెల 9న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల రాఖీ పండుగను జరుపుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు. ఆ సమయంలో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టవచ్చని పండితులు తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో రాఖీ పర్వదినం రోజున భక్తులతో కిటకిటలాడనున్నాయి. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి సోదరులకు రాఖీలు కట్టనున్నారు. దీంతో జిల్లా కేంద్రం, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో కూడా పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాఖీ పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారనున్నాయి.

ఎందుకు జరుపుకుంటారంటే..

ఒక రోజు శ్రీగణేశుడు తన సోదరి మానసదేవితో రాఖీ కట్టించుకుంటుండగా అప్పుడు ఇద్దరు కుమారులు శుభ్, లాభ్‌లు ఇది ఏంటని అడిగారట. అప్పుడు గణేశుడు ఇది రక్షణ కవచం అని, ఈ రక్షాసూత్రం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక అని చెప్పాడట. ఇది విన్న శుభ్, లాభ్‌లు తమకి కూడా ఒక సోదరి కావాలని పట్టుబట్టగా తన కుమారుల కోరిక మేరకు గణేశుడు తన శక్తుల నుంచి ఒక మంటను సృష్టించి దానిని తన భార్యలు సిద్ధి, బుద్ధిల ఇద్దరి ఆత్మశక్తితో కలిపి ఆ వెలుగు నుంచి ఒక అమ్మాయి జన్మించింది. ఆ అమ్మాయికే సంతోషిమాత అని పేరు పెట్టారట.

హిందూ పండుగల్లో ఒకటి..

హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ పండుగ సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీ కట్టి స్వీటు తినిపించి హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. ఈ పండుగ ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రక్షాబంధన్ అనే పదం రక్ష, బంధన్ అనే రెండు పదాలతో ఏర్పడింది. దేవతామూర్తుల కాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది.



వరంగల్ చౌరస్తాలో పూజ సామగ్రి కొనుగోళ్ల సందడి

నేడు వరలక్ష్మి వ్రతం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఇంటింటా మహిళలు వ్రతాలు
- పూజ సామగ్రి కొనుగోలుతో నగరంలో సందడి

వరంగల్ కల్చరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరాలిచ్చే తల్లి వరలక్ష్మి తమ సౌభాగ్యం పసుపు కుంకుమలు ముత్తైదువ తనంతో ఇంటిల్లిపాది అందరు సుఖ సంతోషాలతో ఉండాలని వరలక్ష్మిని వేడుకుంటూ శుక్రవారం రోజు వ్రతాలను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఇంటింటా ఆచరించకోనున్నారు. ప్రతీ ఏడు శ్రావణ మాసంలో మూడో శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించుకుంటారు. ఈ మాసంలో రాజరాజేశ్వరీ దేవాలయంలో ఐదు శుక్రవారాలు సాముహికంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళల చేత నిర్వహిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని నగరంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు వ్రతాలు నిర్వహిస్తారు. ప్రధానంగా భద్రకాళీ దేవాలయం రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ సంతోషీమాత దేవాలయం, శ్రీ వరద దత్తక్షేత్రం మహాలక్ష్మీ, వాసవీ మాత దేవాలయంతోపాటు ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఇంటింటా మహిళలు వ్రతాలు నిర్వహించుకోవడానికి కావల్సిన పూజా సామగ్రి కొనుగోలుతో నగరంలోని బజార్లు కిటకిటలాడాయి. వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, స్టేషన్‌రోడ్డు, అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో పూజా సామగ్రి అమ్మకాలు విక్రయించారు. వ్రతానికి పూలు, పండ్లు కొనుగోళ్లు పెద్దఎత్తున చేశారు. వీటితోపాటు అమ్మవారి ప్రతిమలు నూతన వస్త్రాలు, మిఠాయిల అమ్మకాలతో సందడిగా కనిపించాయి. శ్రావణ మాసం ఆధ్యాత్మిక శోభతో వరాల వరలక్ష్మీ అమ్మవారి వ్రతాల సందడి కనిపించింది.



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజావాణితో ప్రయోజనమేది ?

- జీడబ్ల్యూఎంసీలో దరఖాస్తులు బుట్టదాఖలు
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు ఎక్కువ
- పట్టించుకోని అధికారులు
- సీరియస్‌గా తీసుకోవాలంటున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) సమర్థవంతమైన పాలన అందించాలంటే ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలి. కానీ బల్దియాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రయోజనంగా లేదని బాధితులు విమర్శిస్తున్నారు. గ్రీవెన్ సెల్‌కు హాజరైనా ప్రజల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్ ముందు సమస్యలు పరిష్కరిస్తున్నట్లు నటిస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రజావాణి అధికారులకు తూతూ మంత్రంగా మారింది. ప్రతీ సోమవారం అన్ని విభాగాలకు 100 నుంచి 150 ఫిర్యాదులు వచ్చినా పావలా వంతు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఫిర్యాదులు స్వీకరించడంలో ఉన్న శ్రద్ధ పరిష్కరించడంలో చూపడం లేదు. కమిషనర్ స్వీకరించిన ఫిర్యాదులు అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి బుట్టదాఖలవుతున్నాయి. ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రతీ వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా నగరంలో భవన నిర్మాణాలకు అనుమతులిచ్చి, పుచ్చుకోవడంలోనే అధికారులు బిజీగా ఉంటున్నారని ఆరోపణలొస్తున్నాయి. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, భూ కబ్జాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అనధికార లేఔట్లు, రోడ్ల ఆక్రమణలు, ఖాళీ స్థలాల ఆక్రమణ, వ్యక్తిగత కక్షలతో ఇళ్లు, ప్రహరీల కూల్చివేతలపై ఫిర్యాదులు నిత్యకృత్యంగా మారాయి. నగరవాసుల సమస్యలను పరిష్కరించడంలో సీపీ నుంచి చైన్‌మన్ వరకు సరైన స్పందన లేక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రజావాణి ద్వారా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గంపెడాశతో వచ్చిన ఫిర్యాదుదారులకు నిరాశే మిగుతుంది. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, ఇంజనీరింగ్, తాగునీటి సమస్యలపై ప్రతీ వారం పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందుతాయి. శానిటేషన్ విభాగంలో చెత్త కుప్పల తొలగింపు, డ్రెయినేజీల శుభ్రం, జంతు కళేబరాల తొలగింపు ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగంపై వచ్చిన సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కార మార్గాలు చూపించాల్సిన అధికారులు, సిబ్బంది అటుగా వెళ్లడం లేదు. ప్రజలు పదులసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సమస్య అడిగి తెలుసుకుని పరిష్కారం చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ పంపించి చేతులు దులుపుకుంటున్నట్లు బాధితులు తెలిపారు. ఇంకా కొందరు అధికారుల డబ్బులు ముట్టజెప్పితేనే ఫీల్డ్ విజిట్ చేస్తామని మొండికేస్తున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రక్షాళన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తేనే కమిషనర్, మేయర్‌పై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందనేది వాస్తవం.



బల్దియాలో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, అధికారులు (ఫైల్)

గత 6 నెలలుగా అందిన ఫిర్యాదులు

ఇంజనీరింగ్ - 180
హెల్త్, శానిటేషన్ - 63
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 90
టౌన్‌ప్లానింగ్ - 289
తాగునీటి సరఫరా - 38
- హార్టికల్చర్ - 14
ఎలక్ట్రికల్ - 32
డీఆర్ఎఫ్- 30

వరంగల్ మంత్రి, ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్‌తో పాటు ఆన్‌లైన్‌లో 450 ఫిర్యాదులు అందాయి. మొత్తంగా 1, 186 ఫిర్యాదులు అందగా 200 ఫిర్యాదులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజావాణితో పాటు పర్సనల్‌గా..

నగరవాసులు వారి సమస్యలను ప్రజావాణిలో కమిషనర్, మేయర్, ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లకు అందిస్తున్నారు. కొందరు బల్దియా ద్వారా పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. అయినా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై ప్రజలకు ఆశలు సన్నగిల్లుతున్నాయి.

ప్రజావాణిపై ప్రజల డిమాండ్లు..

- ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై 10 రోజులలో పరిష్కారం చూపాలి.
- కమిషనర్ స్వీకరించిన ఫిర్యాదుల పెండింగ్‌పై ప్రతీ నెల చివరి వారంతో అధికారులతో సమీక్షించాలి.
- టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి.
- ప్రతీ ఫిర్యాదుదారుడికి అక్‌నాల్డ్‌మెంట్ ఇచ్చే విధానం అమలులోకి తేవాలి.
- ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాలపై స్వచ్ఛంద సంస్థలు, భూ బాధితులతో కమిటీలు వేయాలి.
- కబ్జాదారులపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.
- డిజిటల్ ఫిర్యాదు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి.
- ఫిర్యాదులపై దర్యాప్తు అధికారి పేరు, ఫోన్ నెంబర్ వెల్లడించాలి.
- అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి.

బల్దియాలో సమస్యలు పరిష్కారం కాక మా వద్దకు వస్తున్నారు..

- తోట వెంకటేశ్వర్లు, 10 డివిజన్ కార్పొరేటర్



ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుగా మునిసిపాలిటీకి వెళ్తే అక్కడి అధికారులు జాప్యం చేయడంతో మా వద్దకు వస్తున్నారు. మేము ఎమ్మెల్యే, మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిస్తే మా వద్దకు రాకుండా ఉంటారు. అధికారుల నిర్లక్ష్యంపై కమిషనర్, మేయర్ దృష్టి సారించాలి.

రోడ్డు కబ్జా అయ్యిందని పదిసార్లు ఫిర్యాదు చేశాం..

- హరిక, మడికొండ



గ్రేటర్ 64వ డివిజన్ మడికొండ హిల్స్‌కాలనీలో కొందరు రోడ్డును ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని పదిసార్లు ఫిర్యాదు చేశాం. మా కాలనీవాసులు సుమారు 20 మంది ప్రతీ ప్రజావాణిలో వచ్చి ఫిర్యాదు చేస్తున్నాం. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఇంతవరకు ఒక్క అధికారి కూడా వచ్చి చూడలేదు. కమిషనర్ స్పందించి ప్రజల ఫిర్యాదులకు పది రోజుల్లో పరిష్కారం చూపాలి.

హామీలు నిలబెట్టుకోవాలి

- ఆంధ్రప్రదేశ్‌లా పింఛన్ పెంచాలి
- లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతాం..
- పింఛన్‌దారుల సన్నాహక సభలో మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

హసన్‌పర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండలంలోని భీమారం ఎంటీఆర్ గార్డెన్స్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం పెన్షన్‌దారుల సన్నాహక మహాసభ వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వికలాంగులకు పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు, వృద్ధులు, వితంతువులకు రూ.2016 నుంచి రూ.4 వేలకు, కండరాల క్షీణత రోగులకు, ఇతర తీవ్రమైన రోగులకు రూ.15 వేలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వలాగా పెంచి తెలంగాణ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హెచ్చరించారు. అందాల పోటీలకు, భూస్వాములకు రైతు భరోసాకు అభివృద్ధి పేరుతో వేల కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు.. కాళ్లు, కళ్లు, మాట్లాడలేని వికలాంగులకు, వయసు మీద పడిన వృద్ధులకు, భర్త లేకుండా బిడ్డలను పోషించలేని వితంతువులకు, తీవ్రమైన రోగాలతో చావుతో సాహసం చేస్తున్న కండరాల క్షీణత ఇతర రోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్న ఆ సమాజానికి సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు తెలుసుకొని మొదటి వారం లోపు 15 డిమాండ్స్ తీర్చకపోతే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభతో కుప్పకూల్చుతామని హెచ్చరించారు. పేద వర్గాల పింఛన్ పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీలు మౌనం వీడాలని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, వికలాంగుల, వృద్ధులు, వితంతువుల పింఛన్ రూ.200 నుంచి రూ.వేయి, రూ.1500 నుంచి రూ.2వేలు సాధించుకుని ఆంధ్రప్రదేశ్‌లో నేడు రూ.6 వేలు సాధించామన్నారు. ఆ స్ఫూర్తితో తెలంగాణలో కూడా పింఛన్ రూ.6 వేలకు పెంచడంతో పాటు ఇతర డిమాండ్స్ సాధించే వరకు విశ్రమించే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే.విశ్వనాథ్ మాదిగ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆరెపల్లి పవన్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు భిక్షపతిమాదిగతో పాటు జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 21మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 18 మందికి రూ.21,000 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న ఇద్దరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 1,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

హార్టికల్చర్ భూములకు మహర్దశ

- ఉద్యానవన పంటల సాగుకు ఐటీడీఏ మొగ్గు
- కార్యాచరణను సిద్ధం చేస్తున్న అధికారులు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి నిరాదారణకు గురైన భూములకు చలనం కల్గింది. ఐటీడీఏ నిర్లక్ష్యానికి విలువైన భూములు గత పదేళ్లుగా బీడుగా మారాయి. నిరుపయోగంగా మారిన భూముల్లో సాగుకు ఐటీడీఏ ముందడుగు వేసింది. ఐటీడీఏ ఉద్యానవన శాఖకు చెందిన భూముల్లో ఉద్యాన పంటల సాగుకు కసరత్తు చేస్తుంది. ఖాళీగా ఉన్న భూముల్లో పండ్లు, పూల, కూరగాయల సాగుకు ఐటీడీఏ పీవో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు 32 ఎకరాల్లో పండ్లు, పూలు, కూరగాయల సాగుతో పాటు వెదురు లాంటి చెట్లను పెంచనున్నారు.

ఎట్టకేలకు భూములకు మోక్షం

ఐటీడీఏ ఉద్యానవన శాఖకు సుమారు 35 ఎకరాల భూములున్నాయి. గతంలో ఈ భూముల్లో పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు పెంపకాన్ని చేపట్టి గిరిజనుల ఉపాధికి బాటలు వేశారు. కానీ గత పదేళ్లుగా ఉద్యానవన శాఖ నిర్లక్ష్యానికి గురైంది. సంవత్సరాల తరబడి ఈ భూములు బీడుగా మారాయి. విలువైన భూములపై ఐటీడీఏ అలసత్వం ప్రదర్శించింది. మండల కేంద్రంలోని రామన్నగూడెం వెళ్లే రహదారిని ఆనుకొని సుమారు 6 ఎకరాలు భూమితో పాటు ఎక్కెలలోని 28 ఎకరాల్లో భూమి ఉంది. కానీ ఈ భూములపై ఐటీడీఏకు పట్టింపు కొరవడంతో భూములు కొంతమేర కబ్జాకు గురయ్యాయి. పలుమార్లు గిరిజనులు భూములను సాగులోకి తెస్తే తమకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఐటీడీఏ అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం ఐటీడీఏ ఈ భూములపై నజరు పెట్టింది. విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా పీవో చిత్రా మిశ్రా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆ భూములపై రీసర్వేను చేపట్టి హద్దురాళ్ల వేసేందుకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది. గతంలోని భూముల విస్తీర్ణం, ఇప్పుడున్న పరిస్థితిని సర్వే చేసి కబ్జాకు గురైన వాటిని స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. నిరుపయోగంగా మారిన భూముల్లో ఉద్యానవన పంటల సాగుకు ముందుకు రావడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రామన్నగూడెం రోడ్డులోని భూమిని చదును చేస్తున్న దృశ్యం

18 ఎకరాలు.. ఒక్కో ఎకరంలో ఒక్కో రకం

మండల కేంద్రంలోని ఎక్కెల గల హెచ్‌టీసీలో గల 18 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగును చేపట్టనున్నారు. 18 ఎకరాల్లో ఒక్కో ఎకరంలో ఒక్కో రకం పండ్ల తోటలను వేయనున్నారు. మామిడి, సీతాఫలం, నిమ్మ, బత్తాయి, పామాయిల్, ఆపిల్‌బేర్, మునగ, నేరేడు, జామా, సపోటా తదితర పండ్ల మొక్కలను 18 ఎకరాల్లో సాగు చేయనున్నారు. మామిడి 3 ఎకరాలు, సీతాఫలం 1, పామాయిల్ 2, నిమ్మ 1, బత్తాయి 1, ఆపిల్ బేర్ 1, నేరేడు 1, మునగ 1, జామ 3, సపోటా 1 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటనున్నారు. అదేవిధంగా హెచ్‌ఎన్‌సీటీలో గల పాత చెట్లను పునరుద్ధరణతో పాటు రామన్నగూడెం రోడ్డులోని భూముల్లో మామిడి మొక్కల పునరుద్ధరణతో పాటు పూలమొక్కలను సాగు చేయకున్నారు. ఇందుకోసం జిల్లా ఉద్యానవన శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పండ్ల మొక్కల సాగు చేసేందుకు సంబంధించిన భూములను అధికారులు చదును చేస్తున్నారు. సాగుకు సంబంధించిన పనులను వేగంగా జరుగుతున్నాయి.



భూమిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా (ఫైల్)

గిరిజనుల ఉపాధికి ఊతం

హార్టికల్చర్ భూములు ఉపయోగంలోకి రావడంతో స్థానిక గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండ్లు, కూరగాయాలు, పూలమొక్కల పెంపకం చేపట్టి తద్వారా వచ్చే ఫలితాలతో గిరిజనులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, ఆర్థిక వెసులుబాటు కల్గుతుందని పలువురు గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా బీడుగా మారిన భూములు ఉపయోగంలోకి రావడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

దేవాలయ భూములను కాపాడాలి

● సంత నిర్వహించినా రుసుము చెల్లించడం లేదు

● స్పందించని మునిసిపల్ అధికారులు



ఫిర్యాదు చూపుతున్న అర్చకులు

తొర్రూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వేణుగోపాల స్వామి దేవాలయ భూములను పరిరక్షించాలని ఆలయ అర్చకులు అలహరి శ్యాం సుందరాచార్యులు, గోవర్ధనం రాము అన్నారు. గురువారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ 130 సర్వే నంబర్‌లో వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన భూములు పలువురు ఆక్రమించి దానిలో నిర్మాణాలు చేస్తున్నారని, ఇప్పటివరకు 50మేర ఇండ్లు నిర్మించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. దేవాలయ భూమిలో మునిసిపాలిటీ అధికారులు సంత నిర్వహిస్తున్నారని, మునిసిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. డీసీఎంలు నిలపడంతో పాటు పట్టణ ప్రకృతి వనాలు నిర్వహిస్తూ దేవాదాయ శాఖకు రుసుము చెల్లించడం లేదని, తాము వంశపారంపర్యంగా వేణుగోపాల స్వామి ఆలయ అర్చకులుగా ఎలాంటి జీత భత్యాలు లేకుండా పని చేస్తున్నామని, దూప, దీప, నైవేద్యాలు సొంత ఖర్చులతో చేస్తున్నామని, గతంలో దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, సంత నిర్వహించే దేవాలయ భూమిలో కల్యాణ మండపాన్ని ప్రభుత్వ నిధులతో నిర్మించాలన్నారు. దాంతో పాటు పట్టణంలోని శివాలయానికి సంబంధించిన 30 ఎకరాల భూమిని కూడా కాపాడాలని, దీనిపై దేవాదాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



సామాజిక ఆరోగ్య కేంద్రంలో డీసీహెచ్ఎస్‌కు వినతిపత్రం అందిస్తున్న సూపరింటెండెంట్ వీరన్న

గూడూరులో డయాలసిస్ కేంద్రం

గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్ అధికారి డాక్టర్ చింత రమేష్ తెలిపారు. డీసీహెచ్ఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో అవసరమైన మౌళిక వసతులు, నియామకాలు కల్పించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చింత రమేష్ మాట్లాడుతూ గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం 30 పడకలతో నిర్వహణ జరుగుతుందని, అతి త్వరలో 50 పడకలకు అప్‌గ్రేడ్ కానున్నట్లు చెప్పారు. గూడూరు, కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాల గిరిజన, గిరిజనేతర ప్రజలకు గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారనే వైద్యం అందించడం అభినందనీయమన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సహకారంతో గూడూరులో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం ఇవ్వాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్‌లలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులను స్కిల్డ్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం సెక్యూరిటీ గార్డుల సమావేశం వెంకటనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీగార్డులు యార్డులలో వేలం పాటలు నిర్వహించడం, క్లరికల్ పనులు చేయించడం, చెకపోస్టుల వద్ద వాహనాలు తనిఖీ చేయడం, మార్కెట్ ఫీజు వసూలు చేయడం, రసీదులు ఇవ్వడం లాంటి పనులు అప్పగిస్తున్నారని చెప్పారు. వేతనాలను ఏజెన్సీల ద్వారా కాకుండా మార్కెట్ కమిటీల ద్వారా ఇప్పించాలని, 61 ఏళ్ల సెక్యూరిటీగార్డులకు పదవీవిరమణ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జాతీయ సదస్సు జరుగుతుందని తెలిపారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ కుమ్మరికుంట్ల నాగన్న, యూనియన్ నాయకులు రాములు, జనార్దన్, వీరన్న, సరోజ, లక్ష్మి, యాకన్న, యాకయ్య, పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా పాలకుల విధానాల మూలంగా తమ హక్కులను కోల్పోతున్న ఆదివాసీ, గిరిజన ప్రజానీకం ఆగస్టు 9న హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురంభీమ్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్‌ను ఉల్లంఘిస్తూ పాలకవర్గాలు పరిపాలన సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న అపార ఖనిజ సంపదను విదేశీ, స్వదేశీ బహుళ జాతి కంపెనీలకు దారాదత్తం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఉమగాని సత్యం, రాంచంద్రు, ప్రవీణ్, వీరునాయక్, వెంకన్న, యాకయ్య, లక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రవి

కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● మాజీ ఎంపీ సీతారాంనాయక్

గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలో గురువారం మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రజానీకానికి వివరించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్, మెరుగు మల్లయ్య, మేరెడ్డి సురేందర్, అనిల్, సోమునాయక్, లక్ష్మణ్, మోతీలాల్, నాగరాజు, మల్లేష్, రవి, శ్రీశైలం, కొమ్మాలు, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మానుకోట మాజీ ఎంపీ సీతారాంనాయక్

మరిపెడ మండల, పట్టణ గౌడ యువజన కమిటీల ఎన్నిక

మరిపెడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల, పట్టణ గౌడ యువజన కమిటీలను గురువారం మరిపెడ విశ్రాంతి భవన్‌లో ఎన్నుకున్నారు. మరిపెడ మండల అధ్యక్షుడిగా గుండగాని రంగనాథ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గండి భార్గవ్, ఉపాధ్యక్షుడిగా సోమగాని సాయికుమార్, కార్యదర్శిగా తండ సతీశ్, సహాయ కార్యదర్శిగా గాదెగాని నరేశ్, కోశాధికారిగా రాంపెల్లి రంజిత్, కార్యదర్శులుగా గంధసిరి వేణు, సందీప్, అశోక్, అవినాశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరిపెడ పట్టణ అధ్యక్షుడిగా గుండగాని నరేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మహేశ్, కార్యదర్శిగా రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల పక్రియను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దీపక్, గోపా సంఘం బాధ్యులు లింగా మహేశ్‌గౌడ్, గంధసిరి కృష్ణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బోడపట్ల సతీశ్, రాంపెల్లి కపిల్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

మరిపెడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరైనట్లు మరిపెడ మండల వ్యవసాయశాఖ అధికారి బోడా వీరాసింగ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మరిపెడ మండలానికి 26 పవర్ స్ప్రేయర్స్ ట్రాక్టర్ల రోటివేటర్స్ 11మంజూరైనట్లు చెప్పారు. అర్హులైన రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రోటివేటర్స్ కోసం ట్రాక్టర్ ఆర్‌సీ బుక్ జిరాక్స్‌లను జత చేసి ఆయా గ్రామాల ఏఈవోలకు అందచేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ, మహిళ రైతులకు 50శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల శ్రమదానం



శ్రమదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మరిపెడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ 5వ వార్డులో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు శ్రమదానం నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ పిలుపు మేరకు ఇందిరమ్మ పట్టణ ప్రగతి యాత్రలో భాగంగా లోక్యాతండాలోని పలు వీధుల్లో పేరుకపోయిన చెత్తచెదారం, పిచ్చి మొక్కలను తొలిగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, అఫ్జల్, శ్రీపాల్‌రెడ్డి, రాంలాల్, రవికాంత్, సురేశ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వాన దేవుడా.!?

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. 268 చెరువులు అంతంతమాత్రంగానే నీరు చేరింది. నెల్లికుదురులో 53, తొర్రూరులో 48, గూడూరులో 12, చిన్న గూడూరులో 19, దంతాలపల్లిలో 19, డోర్నకల్‌లో 18, మరిపెడలో 43, నర్సింహులపేటలో 17, కేసముద్రంలో 4, ఇనుగుర్తిలో 13, పెద్దవంగరలో 22 చెరువుల్లో నీరులేక వెలవెలబోతున్నాయి.

ఈ వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 4,21,301 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈనెల 7వ తేదీ నాటికి 2,14,188 ఎకరాల్లో మాత్రమే సాగైంది. వరి 2,21,282 ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉండగా ఆగస్టు 2 వరకు 78,276 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో వరినాట్లు నెమ్మదించాయి. మొక్కజొన్న 58,361 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 55,536 ఎకరాల్లో, కందులు 393 ఎకరాల్లో, పెసర 4,555 ఎకరాలకు గాను 1,615 ఎకరాల్లో, ఇతర పంటలు 44 ఎకరాల్లో, పసుపు 140 ఎకరాల్లో సాగు చేశారు.

పత్తి 84,854కు గాను 78,144 ఎకరాల్లో మాత్రమే వేశారు. నువ్వులు, వేరుశనగ పంటలు అసలే ఎక్కడ ఏ గ్రామంలో వేయలేదు. ఇకపోతే మిర్చి 52,249 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. వర్షాలు లేకపోవడంతో ఈ పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం'

జనగామ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి రోజుకో తీరుగా దొంగ మాటలు మాట్లాడుతూ బీసీలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అధ్యక్షతన గురువారం జనగామ జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సందర్భంగా నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా జిల్లాకు రావడంతో జనగామ మండలంలో పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద స్వాగతం పలికారు. పెంబర్తిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనగామ నెహ్రూ పార్కు నుంచి జూబ్లీ ఫంక్షన్ హాల్ వరకు కోలాటాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రామచందర్ రావు హాజరై మాట్లాడారు.

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. 10శాతం ముస్లిలకు బీసీ రిజర్వేషన్ ఇస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రామచందర్ రావు అన్నారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, 19 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తప్ప ఇప్పటి వరకు ఏ సీఎం ఇన్ని సార్లు ఢిల్లీ వెళ్లాలేదని ఆరోపించారు.

● బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకు సీఐడీకి అప్పగింత..

బీఆర్ఎస్ నాయకులకు కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణను సీబీఐకి అప్పగించడం లేదని రామచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని ఇద్దరు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను దివాలా తీశారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ప్రతీ ఒక్క స్థానంలో పోటీ చేస్తారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడప ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని, 2028లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి గుండె విజయరామరావు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు నేతి సుభాష్ రెడ్డి, ఆరూరి రమేశ్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, డాక్టర్ మాజీ కల్నాల్ మాచర్ల భిక్షపతి కత్తుల లక్ష్మి, బొమ్మకంటి అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన ఏఎంసీ డైరెక్టర్

కొత్తగూడ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజ్ కుమార్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ బొల్లు రమేష్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై రాజ్‌కుమార్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రమేష్ వెంట కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల నాయకుడు కట్రోజు భిక్షపతి ఉన్నారు. ఎస్సై రాజ్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రీముసలమ్మ ఆటో యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, మాజీ సర్పంచ్ భూపతి తిరుపతి, అధికార ప్రతినిధి బానోత్ జవహర్‌లాల్ నెహ్రూ, మండల నాయకుడు బొల్లు రవి, మోకాళ్ల వెంకటేష్, ననుబోతుల లింగన్న, బానోత్ వీరన్న, ఆటో యూనియన్ నాయకులు ఎండీ అప్సర్, తాళ్ల రవికుమార్, తాజ్నీత్ రెడ్డి, నక్క నరేష్, రాజన్న, జితేందర్, కిరణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కమలాకర్‌ను అభినందించిన సీఎం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో చురుకుగా వ్యవహరించిన జిల్లాలోని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. జంతర్ మంతర్ ధర్నా విజయవంతంలో చురుకుగా పాల్గొన్న రాష్ట్రంలోని కాంగ్రెస్ బీసీ నేతలను న్యూఢిల్లీలో తన అధికారిక నివాసంలో గురువారం అభినందించారు. అందులో భాగంగా మానుకోట జిల్లాకు చెందిన గునిగంటి కమలాకర్‌ను అభినందించారు. బీసీలందరిని ఐక్యం చేసి 42 శాతం రిజర్వేషన్ల సాధించేంత వరకు చురుకైన పాత్ర పోషించాలని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేంత వరకు నిర్వీరామంగా శ్రమించాలని సీఎం సూచించినట్లు కమలాకర్ తెలిపారు.

11న నులిపురుగుల నివారణ దినోత్సవం

డోర్నకల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండల వ్యాప్తంగా ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు సాద్విజ తెలిపారు. గురువారం డోర్నకల్ పీహెచ్‌సీలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శులు, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు గల వారందరికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో లక్ష్మా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'మాక్‌పోల్'తో నాయకత్వ లక్షణాలు

ఎంఈవో బాలాజీనాయక్

కురవి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మాక్‌పోల్‌తో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. నేరడ ఆదర్శ పాఠశాలలో గురువారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. పాఠశాలలో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలను చేయించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన పెరుగుతుందని ఎంఈవో చెప్పారు. ప్రిన్సిపల్ వై.శ్రీకాంత్, చైర్మన్ కనకమ్మ, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో సరస్వతి పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి ముస్లింలను లాగొద్దు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం చేతకాక బీజేపీ కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ముస్లింలను టార్గెట్ చేసి మాట్లాడడం సరికాదని తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ పార్టీ ధర్నా చేసిందనడం కేంద్ర మంత్రులకు తగదన్నారు.



రూ.కోటి చెక్కును అందిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

దంతాలపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం హర్షనీయమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం కమలాకర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని రేపోణి గ్రామంలో జన సురక్ష క్యాంపులో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం యాదగిరి, యూబీఐ నోడల్ అధికారి రవి వర్మ, దంతాలపల్లి బ్యాంక్ మేనేజర్ జయ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ రామేశ్వర్‌జీ, తొర్రూరు బీఎం మనీష్, ఐకేపీ ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ భవన్‌లో చేనేత దినోత్సవం

కేసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలోని పద్మశాలీ భవన్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. భక్త మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిట్యాల వీరన్న, కాముని కుమారస్వామి, బొద్దుల సురేందర్, సామల నర్సయ్య, మిడతనపల్లి ప్రకాశ్ పాల్గొన్నారు.

'తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం'

తొర్రూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని సేవా తరుణి అధ్యక్షురాలు టి.శ్రీదేవిరెడ్డి అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ సేవా తరుణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. చంటి పిల్లల విషయాలను వివరాలు తెలిపారు. 30 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు జ్వలిత, మీరజ్, శారద తదితరులు పాల్గొన్నారు.

'ముర్రుపాలు బిడ్డకు ఎంతో ఉపయోగం'

గూడూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగిస్తే రోగనిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని డీసీహెచ్ఎస్ డాక్టర్ చింత రమేష్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణీలకు, బాలింతలకు ముర్రుపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిడ్డపుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తప్పకుండా తల్లిపాలు అందించాలన్నారు. ఆర్నెళ్ల తర్వాత అనుబంధ ఆహారంతో పాటు తల్లి పాలను సైతం అందించాలన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్ ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని షీటీ ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోడు ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలలో భరోసా, షీటీం సమన్వయంతో విద్యార్థులకు సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, నేరాలు, అఘాయిత్యాలపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించినా, మానవ అక్రమ రవాణా జరిగినట్లు తెలిస్తే 8712 656935 కి సమాచారం అందించాలన్నారు. హెచ్ఎం ఎం.కోట్యానాయక్, ఉపాధ్యాయ బృందం, షీటీం సిబ్బంది అరుణ, పార్వతి, సౌభాగ్య రమేష్ పాల్గొన్నారు.

కుప్పలు తెప్పలు.. 'రెవెన్యూ' తిప్పలు...

(5వ పేజీ తరువాయి)

అర్హులైనవారిని ఎంపికచేసి 50 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. తుది ఎంపిక కోసం గత నెల 27న రాతపరీక్ష నిర్వహించారు. భూసమస్యల పరిష్కారంలో గ్రామపాలనాధికారులు, సర్వేయర్ల వ్యవస్థ ప్రాధాన్యతను సంతరించుకున్నది. వీరి నియామకాలను ఎంత త్వరగా చేపడితే అ దరఖాస్తులను అంత త్వరగా పరిష్కరించే అవకాశలుంటాయని అధికారులు భావిస్తున్నారు. ఓ వైపు సిబ్బంది కొరత, మరో వైపు ప్రభుత్వం విధించిన గడువు అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

విచారణలు ఎలా?

గత ఆర్‌వోఆర్ -2020, ధరణిలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ లేదు. కొత్త చట్టం భూభారతి అమల్లోకి రావడంతో నోటీసుల జారీ, విచారణకు అవకాశం, అప్పీళ్ల వ్యవస్థ అందుబాటులోకి వచ్చాయి. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టేందుకు వ్యవస్థలేవి లేవు. ఇప్పుడు వీఆర్‌ఏ, వీఆర్‌వోల అవసరం తెలిసి వచ్చింది. ఈ క్రమంలో గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామకానికి రెవెన్యూ శాఖ కార్యాచరణ చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో 1668 మంది ఎంపికయ్యారు. వీరికి ఇంకా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. సిబ్బంది కొరత నేపథ్యంలో దరఖాస్తుల పరిష్కారం కష్టమవుతోంది.

వివిధ సమస్యలపై..

రెవెన్యూ సదస్సుల్లో పదికిపైగా భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు దాఖలయ్యాయి. సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పెండింగ్ మ్యుటేషన్స్, డిజిటల్ సైనింగ్, విస్తీర్ణంలో మార్పులు, పట్టాదారులో మార్పులు చేర్పులు, అసైన్డ్ భూములు, ఖాతా మార్పు, నిషేధిత భూములు, భూసేకరణ, ఇతరత్రా సమస్యలు వీటిలో ఉన్నాయి. వీటిలో సాదాబైనామా, అసైన్డ్ భూములు, భూసేకరణ, నిషేధిత భూములు మినహా మిగతా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే రెవెన్యూ అధికారులు పరిష్కరించేందుకు అవకాశం ఉంది. మిగతావన్నీ చట్టపరమైన, న్యాయపరమైన చిక్కులతో ముడిపడి ఉన్నాయి. సాదాబైనామా దరఖాస్తులనే తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో అందిన మొత్తం దరఖాస్తుల్లో 75 శాతం ఇవే ఉన్నాయి.

ఒక్క హనుమకొండ జిల్లాలోనే 20వేలకుపైగా దరఖాస్తులు ఈ తరహాకు చెందినవే. సాదాబైనామా భూముల వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉన్నందువల్ల ఇందుకు సంబంధించిన దరఖాస్తుల విషయంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి ప్రక్రియ చేపట్టరాదని ప్రభుత్వమే ఆదేశించింది. ఇక అసైన్డ్ భూముల దరఖాస్తులు కూడా పెద్ద సంఖ్యలో అందాయి. మొత్తం దరఖాస్తుల్లో 15 శాతం మేరకు ఇవే ఉన్నాయి. వీటిని రెవెన్యూ అధికారులు నేరుగా పరిష్కరించే అవకాశమే లేదు. ఎమ్మెల్యే అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ వీటిని పరిష్కరించాల్సి ఉంది. కానీ ఎక్కడ ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు కాలేదు.

నిషేధిత భూముల దరఖాస్తుల్లో చాలా వరకు కోర్టు కేసులతో ముడిపడి ఉన్నాయి. వీటిని కూడా ముట్టుకునే పరిస్థితి లేదు. ఇలాంటి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం నిర్దిష్టమైన వ్యవస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయకుండానే దరఖాస్తులను స్వీకరించింది. అందిన దరఖాస్తుల్లో వాస్తవంగా రెవెన్యూ అధికారులు పరిష్కరించగలిగేవి 20 నుంచి 25 శాతం మాత్రమే ఉన్నాయి. తమ పరిధిలో లేనివి, తమ వల్లకాని దరఖాస్తులన్నిటినీ అధికారులు పక్కబెట్టారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టు 15 నాటికి అన్ని భూభారతి దరఖాస్తులను ఎలా పరిష్కరించేదని రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.